జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాంప్రసాద్‌రెడ్డి



ఈనాడు, చిత్తూరు: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి కార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన సమీక్షిస్తారు. అధికారులు, స్థానిక శాసనసభ్యులతో సమన్వయం చేసుకుంటారు. పొరుగునే ఉన్న అన్నమయ్య జిల్లా రాయచోటి ఎమ్మెల్యేగా రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు. పలుమార్లు ఆయన జిల్లాలో పర్యటించారు. నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సోమల మండలంలోని ఆవులపల్లె రిజర్వాయర్‌నూ ఆయన సందర్శించారు.

దివ్యాంగులకు యుడీ ఐడీ కార్డు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే దివ్యాంగులకు యునిక్యూ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు(యుడీ ఐడీ) తప్పనిసరి అని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. https://swaviambancard.gov.inలో సదరం ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, తెల్ల కాగితంపై సంతకం చేసి నమోదు చేసుకొని, అకనాలెడ్జ్‌మెంట్ పొందాలని, నమోదు చేసుకున్న పది రోజుల తర్వాత యుడీ ఐడీ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా మంగళవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీజీహెచ్ వరకు వేచి ఉన్నారు. వీరికి దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. సోమవారం శ్రీవారిని 75,361 మంది దర్శించుకున్నారు. రూ.3.91 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

20న సంకటహర గణపతి వ్రతం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ఈ నెల 20వ తేదీన సంకటహర చతుర్థి సందర్భంగా సామూహిక సంకటహర గణపతి వ్రతాన్ని ఉదయం, సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి.గురుప్రసాద్ మంగళవారం తెలిపారు. రాత్రి స్వామివారి స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు.

వైకాపా పాపం.. రైతులకు శాపం!

- నివర్ తుపానుకు దెబ్బతిన్న చెరువులకు శాశ్వత మరమ్మతులు కరవు
- అతి భారీ వర్షాలు కురిస్తే ప్రమాదం తప్పదని అన్నదాతల ఆందోళన



బైరెడ్డిపల్లె మండలం కైగల్ సమీపంలోని ఊరి ముందర చెరువు మొరవ నాలుగేళ్ల క్రితం అప్పట్లో కురిసిన వర్షాలకు దెబ్బతింది. వైకాపా హయాంలో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదు. ఇప్పుడు భారీస్థాయిలో వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో చెరువు నిండే అవకాశం లేదు.

ఈనాడు, చిత్తూరు:

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో సోమవారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో చెరువుల కింద పొలాలున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. వైకాపా హయాంలో 2020 నవంబరులో నివర్ తుపాను, ఆ తర్వాత ఏడాది కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న జలవనరులకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడమే దీనికి కారణం. పలుమార్లు అధికారులు ప్రతిపాదనలు పంపినా జగన్ సర్కార్ నిధులు విడుదల చేయలేదు. దీంతో కొన్నిచోట్ల అన్నదాతలే ముందుకు వచ్చి తాత్కాలిక ప్రాతిపదికన పనులు చేసుకున్నారు. మరోసారి అధిక వర్షపాతం నమోదైతే చెరువుల్లో నీరు నిల్వ ఉండదని.. పొలాల్లో ఇసుక మేటలు మేసే ప్రమాదముందని వాపోతున్నారు.

జిల్లాలో చెరువులు, బోర్లపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. 32 మండలాల్లో 3,991 చెరువులుండగా 1.13 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో 2020 నవంబరులో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. దాదాపు అన్ని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పడమటి ప్రాంతాలైన పుంగనూరు, పలమనేరు, కుప్పంతోపాటు పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లోని చెరువులకు సామర్థ్యానికి మించి వరద ప్రవాహం వచ్చింది. దీంతో కొన్నిచోట్ల కట్టలు తెగిపోగా మరికొన్ని ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. పలుచోట్ల మొరవ దెబ్బతింది. 2021, 2022లోనూ భారీగానే వర్షపాతం నమోదైంది. అప్పుడు తీవ్రత కొంత తక్కువగా ఉంది. ఇలా అన్ని మండలాల్లో కలిపి 1,398 చెరువులకు నష్టం వాటిల్లింది.

రూ.450 కోట్లతో ప్రతిపాదనలు పంపినా

2020 నుంచి 2022 వరకు పడిన వానలతో ప్రధానంగా పుంగనూరు నియోజకవర్గంలోని సోమల, సదుం, పులిచెర్ల మండలాలు ప్రభావితమయ్యాయి. పలమనేరులో పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. చిత్తూరు మండలం, గుడిపాలలోనూ ఇదే పరిస్థితి. అప్పట్లో దెబ్బతిన్న చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేయాలంటే రూ.21 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అధికారులు నివేదిక పంపారు. శాశ్వత ప్రాతిపదికన చేపట్టేందుకు సుమారు రూ.450 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. పదేపదే ప్రతిపాదనలు పంపినా జగన్ ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. దాంతో తాత్కాలికంగా పనులు చేసి మమ అనిపించారు. కొన్నిచోట్ల మాత్రం రైతాంగం నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు రావడంతో చర్యలు తీసుకున్నారు.

ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పరిశీలిస్తేనే..

బుధ, గురువారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని భావించిన నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లోని చెరువులను యంత్రాంగం పరిశీలించింది. పలుచోట్ల తూతూమంత్రంగా తనిఖీ చేశారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన పరిశీలిస్తే నష్టాన్ని తగ్గించవచ్చు. అన్నింటి కన్నా ప్రధానంగా చెరువుల్లో నీటిని నిల్వ చేసి సాగు కష్టాలు తీర్చవచ్చు.



చిత్తూరులో పట్టపగలే దట్టంగా మేఘాలు కమ్ముకుని జల్లులు పడుతున్న దృశ్యం

జిల్లాలోని చెరువులు: 3,991 | ఆయకట్టు: 1.13 లక్షల ఎకరాలు | వైకాపా హయాంలో దెబ్బతిన్న చెరువులు: 1,398

తాత్కాలిక మరమ్మతులకు అంచనా వ్యయం: రూ.21 కోట్లు | శాశ్వత మరమ్మతులకయ్యే వ్యయం: రూ.450 కోట్లు

వరద సహాయ నిధి కింద రూ.కోటి విడుదల

- సహాయక శిబిరాలు, ఆహారానికి ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వరద సహాయ నిధిగా జిల్లాకు రూ.కోటి విడుదల చేసింది. సహాయక శిబిరాలు, ఆహారం, తాగునీరు, పాలు, వైద్యసేవలు, పారిశుద్ధ్యం పనులకు ప్రాధాన్యమివ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

మూడు గంటలకోసారి ఆరా: జిల్లాలో మంగళవారం రోజంతా ముసురు అలుముకుంది. నగరి, విజయపురం, నింద్ర మండలాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. మిగిలిన చోట్ల తేలికపాటి వర్షపాతం నమోదైంది. మరికొన్ని ప్రాంతాల్లో చలిగాలులతో కూడిన తుంపర్లు పడ్డాయి. మండలాల్లో పరిస్థితిపై ప్రతి మూడు గంటలకోసారి తాజా నివేదికపై కలెక్టర్ సుమిత్ కుమార్ ఆరా తీశారు.

బయట తిరగొద్దు: కలెక్టర్

జిల్లాలో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరిక నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇంటికే పరిమితం కావాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దన్నారు. వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతుల్ని అప్రమత్తం చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం నిమిత్తం కలెక్టరేట్‌తో పాటు, ఆర్డీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

జిల్లా అంతటా ముసురు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. మంగళవారం తెల్లవారుజామున నుంచి రాత్రి వరకు ముసురు వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో వాహనదారులు, పాదచారులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తూర్పు ప్రాంత మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా.. పశ్చిమ ప్రాంత మండలాల్లో తేలికపాటి వర్షానికే పరిమితమైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా.. నింద్ర మండలంలో 29.4 మి.మీటర్లు, పెద్దపంజాణి 24.2, రామకుప్పం, గుడిపాల 23.4, ఎస్ఆర్ పురం 22.4, బంగారుపాళ్యం 20.1, పులిచెర్ల 20.0, నగరి 19.2, పుంగనూరు 18.4, వి.కోట 18.2, శాంతిపురం 17.8, గుడుపల్లి 17.2, బైరెడ్డిపల్లె 16.4, చౌడేపల్లె 15.6, సోమల 14.6, తవణంపల్లె 14.0, సదుం 13.9, విజయపురం, పలమనేరు 13.0, యాదమరి, పాలసముద్రం, కార్వేటినగరం 12.4, గంగవరం 12.2 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

మేఘుమా.. కరుణించుమా!

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. అందుకు బైరెడ్డిపల్లె మండలంలోని కడపనత్తం పెద్దచెరువు ఎండిపోయి కనిపించడమే నిదర్శనం. అల్పపీడన ప్రభావంతో మంగళవారం రోజంతా ముసురు పట్టింది. ఈ ప్రభావం పశ్చిమ నియోజకవర్గాలైన కుప్పం, పలమనేరు, పుంగనూరులో కనిపించింది. రోజంతా వర్షం కురుస్తూనే ఉన్నా రహదారులు తడవని పరిస్థితి. మంగళవారం సాయంత్రం కడపనత్తం చెరువు వద్ద ఇలా నిండు మేఘాలు కమ్ముకుని ఉండగా.. వర్షం కోసం చెరువు వేడుకుంటున్న పరిస్థితి కనిపించింది. ఆ దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.



కడపనత్తం పెద్దచెరువు వద్ద నేలకు దిగొచ్చినట్టు కనిపిస్తున్న మేఘాలు


ఇన్‌ఛార్జి డీపీవోగా పార్వతి



చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి డీపీవోగా పార్వతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి బదిలీపై చిత్తూరు డీఎల్‌పీవోగా వచ్చారు. ఇది వరకు డీఎల్‌పీవో, ఇన్‌ఛార్జి డీపీవోగా ఉన్న లక్ష్మి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. జిల్లా పంచాయతీ అధికారిగా నాగేశ్వర్‌నాయక్‌ను నియమించినా ఆయన ఇంకా విధుల్లో చేరలేదు. ఆయన బాధ్యతలు స్వీకరించే వరకూ పార్వతి ఇన్‌ఛార్జి డీపీవోగా వ్యవహరించనున్నారు.

ఏపీకే అప్లికేషన్ పంపి.. ఖాతాలో నగదు కొల్లగొట్టి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పంలో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. వాట్సప్ గ్రూపుల్లో ఏపీకే అప్లికేషన్ పేరిట బ్యాంకు రివార్డు పాయింట్లు వచ్చాయంటూ సందేశం పంపుతారు. దాన్ని క్లిక్ చేయగానే వారి ఖాతాలు, క్రెడిట్ కార్డుల్లోని నగదు ఖాళీ అవుతుంది. తాజాగా పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కుప్పం పట్టణానికి చెందిన గజేంద్ర మంగళవారం మోసం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపులో వచ్చిన ఓ బ్యాంకుకు చెందిన ఏపీకే అప్లికేషన్ క్లిక్ చేయగా దశలవారీగా క్రెడిట్ కార్డు నుంచి రూ.59 వేల వరకు చెల్లింపులు జరిగినట్లు సందేశాలు వచ్చినట్లు వాపోయాడు. ముందుగా సంబంధిత బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా పరిశీలించి సైబర్ మోసంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో అతను ఆశ్రయించినట్లు తెలిపారు. కార్డు వివరాలు ఎవరికీ ఇవ్వలేదని నగదు ఎలా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అతని నుంచి ఫిర్యాదు స్వీకరించారు. రెండు రోజుల కిందట ఓ బాధితుడు ఇలాగే పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. వారం రోజుల నుంచి పలువురు ఉపాధ్యాయులు సైతం ఇవే ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.



గ్రూపులో వచ్చిన బ్యాంకు ఏపీకే సందేశం

104 మద్యం దుకాణాలు.. నేడే ప్రారంభం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లాలో నోటిఫై చేసిన 104 ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దుకాణాలు దక్కించుకున్న వారు ఇప్పటికే ప్రొవిజినల్ లైసెన్సులు, మద్యం కొనుగోలు కోసం యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు అందుకున్నారు. మంగళవారమే కొంత మంది మద్యం నిల్వలను దిగుమతి చేసుకోగా.. కొంత మంది బుధవారం దిగుమతి చేసుకుని, అదే రోజు వ్యాపారాన్ని ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం అన్ని మద్యం దుకాణాల్లో నాణ్యమైన, ఖరీదైన మద్యం విక్రయాలు జరగనున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన రూ.99 మద్యం సీసాలు కూడా అందుబాటులో ఉండనున్నాయి. మద్యం దుకాణాల వెలుపలే ధరల పట్టి కూడా ఏర్పాటు చేసేలా ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేశారు.

తిరుపతిలో ఎక్కడెక్కడ కుదరదంటే..

తిరుపతి నగరం నుంచి తిరుమలకు వెళ్లే ప్రధాన మార్గంలో మద్యం దుకాణాలు నిషేధించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు, విష్ణు నివాసం, శ్రీనివాసం, కపిలతీర్థం, అలిపిరి.. ఇక్కడి నుంచి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల కూడలి వరకు ఉన్న బైపాస్ రోడ్డుకు ఇరువైపులా మద్యం దుకాణాల ఏర్పాటు చేయకూడదు. రోడ్డుకు ముందున్న దుకాణాలు కాకుండా రెండో భవనం నుంచి దుకాణాలు పెట్టుకోవచ్చు.

బడికి.. గుడికి దూరంగా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే:

నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలు కానుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణం ఏర్పాటును పరిశీలించి శాశ్వత అనుమతులు మంజూరు చేస్తారు. అందులో ప్రధానంగా ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల దూరంలో మద్యం దుకాణం నెలకొల్పాలి. రాష్ట్ర దేవాదాయశాఖ గుర్తించిన ఆలయాలు, వక్ఫ్‌బోర్డు అనుమతించిన మసీదులు, ప్రభుత్వం అనుమతించిన చర్చిలకు వంద మీటర్ల ఆవల ఏర్పాటు చేసుకోవచ్చు. 30 పడకలకు మించి ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆస్పత్రుల పరిధిలో ఇదే నిబంధన వర్తిస్తుంది. నగరపాలక, పురపాలక సంస్థల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లినా మద్యం దుకాణాల ఏర్పాటుకు అభ్యంతరం లేదు. 20 వేల కన్నా తక్కువ జనాభాగల గ్రామాల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్తుంటే.. 220 మీటర్లకు దూరంగా దుకాణాలు ఉండాలి. 20 వేల జనాభా కన్నా అధికంగా ప్రజలు ఉన్న గ్రామాల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల హైవేలు ఉంటే 500 మీటర్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

దోచినా దాచేస్తాం

- గోప్యంగా రూ.2.05 కోట్ల బియ్యం అవినీతి వ్యవహారం
- లోతుగా విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి



పుత్తూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అన్ని విషయాల్లో నిక్కచ్చిగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొందరు అధికారులు మాత్రం ఇప్పటికీ వైకాపా ప్రభుత్వ వాసనలు వీడటం లేదు. కొన్ని శాఖల్లో అవినీతి జరుగుతున్నా గోప్యంగా ఉంచుతున్నారు. తాజాగా పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంలో జరిగిన అవినీతిని అధికారులకు దాచేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పుత్తూరు గోదాం సీఎస్‌డీటీగా విష్ణు గత ప్రభుత్వ హయాం నుంచే ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ గోదాంలో రేషన్ బియ్యంకు సంబంధించి రూ.2.05 కోట్ల అవినీతి జరిగినట్లు ఆ శాఖ ఉన్నతాధికారిణి తనిఖీల్లో వెల్లడైనా గోప్యంగా ఉంచారు.

పుత్తూరు పౌరసరఫరాలశాఖ గోదాం పరిధిలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాలున్నాయి. వీటి పరిధిలో 109 రేషన్ దుకాణాలున్నాయి. ప్రతి నెలా ఈ దుకాణాలకు పుత్తూరు గోదాం నుంచి 25 వేల బస్తాల బియ్యం డీలర్లకు అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే అవినీతి చోటుచేసుకుంది. గత నెల తిరుపతి జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు డీఎం సుమతి సమక్షంలో పుత్తూరు గోదాంను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్ పరిశీలించారు. గోదాంలో ఉన్న స్టాకు.. అక్కడ నిల్వ ఉన్న స్టాకులో వ్యత్యాసాన్ని గుర్తించారు. దీంతో మొత్తం రికార్డులు తనిఖీ చేశారు. సుమారు 205 టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. దీనిపై ఈనెల 12న పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దొంగలు దూరిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు



విష్ణు

అవినీతికి పాల్పడ్డ సీఎస్‌డీటీ విష్ణు అజ్ఞాతంలోకి వెళ్లాక పౌరసరఫరాలశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల రోజుల వ్యవధిలోనే 205 టన్నుల బియ్యం అక్రమంగా తరలించారనేది అవాస్తవం. ఈ తతంగం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఇదంతా ఆ శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరిగినట్లు సమాచారం. ఆ శాఖలో జరిగిన అవినీతి బట్టబయలు కావాలంటే కలెక్టర్ దీనిపై నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తే మరింత మంది పాత్రదారుల గుట్లు రట్టయ్యే అవకాశాలున్నాయి. కాగా.. విష్ణును తొలించాక శ్రీకాళహస్తి సీఎస్‌డీటీ రమేష్‌బాబుకు పుత్తూరు గోదాం అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఎన్నో అనుమానాలు

205 టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్లు లెక్కల్లో సెప్టెంబరు 25నే తేలింది. జేసీ వద్ద అదే రోజు నివేదిక ఇచ్చారు. సెప్టెంబరు 27న విష్ణును సస్పెండ్ చేస్తున్నట్లు జేసీ శుభం భన్సల్ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ నెల 12న విజయదశమి రోజున పౌరసరఫరాలశాఖ అధికారులు పుత్తూరు సీఐ సురేంద్రనాయుడుకు అవినీతికి పాల్పడ్డ సీఎస్‌డీటీ విష్ణుపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని అటు పౌరసరఫరాలశాఖ అధికారులు, పోలీసులు గోప్యంగా ఉంచారు. మీడియాకు వెల్లడించలేదు. ఈ విషయంలో జేసీ పాత్రపై కూడా పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయం ఎక్కడా బయటకు పొక్కనీయకుండా ఆయన కనుసన్నల్లోనే జరిగినట్లు ఆ శాఖ అధికారులే వెల్లడించడం గమనార్హం.

రేపు శ్రీవారి పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి నిర్వహించే గరుడసేవను గురువారం నిర్వహించనున్నారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ గరుత్మంతుడిపై శ్రీమలయప్పస్వామి కొలువుదీరి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించనున్నారు.

టెట్‌కు 293 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్‌కు మంగళవారం 293 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 400 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 107 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాలలో 200 మందికి గాను 158 మంది, చెన్నై ప్రగ్య టెక్నాలజీ కేంద్రంలో 200 మందికి గాను 135 మంది హాజరయ్యారు.

పోలీసు శాఖకు 16 ఫిర్యాదులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమానికి 16 ఫిర్యాదులు అందాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందించారు. ఎస్పీ మణికంఠ వాటిని స్వీకరించి సంబంధిత స్టేషన్ అధికారులకు సిఫార్సు చేశారు. ఆపై పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం ఉండకూడదని చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

త్వరలో 255 నీటి సంఘాలకు ఎన్నికలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా 255 నీటి వినియోగదారుల సంఘాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా జల వనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నామన్నారు. ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణపై మంగళవారం చిత్తూరు, పలమనేరు డివిజన్ కార్యాలయాల్లో వేర్వేరుగా ఇంజినీర్లకు శిక్షణ ఇచ్చారు. చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులందరికీ ఓటు హక్కు కల్పించాలని ఆయన చెప్పారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా రైతుల ఓటర్ల జాబితా రూపొందించాలని తెలిపారు.

విద్యుత్తు శాఖలో పునర్విభజనకు కసరత్తు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లా విద్యుత్తు శాఖలో మండలాల పునర్విభజనకు కసరత్తు మొదలైంది. విద్యుత్తు శాఖ తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి జిల్లాను విభజించి.. చిత్తూరులో నూతన సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నూతన సర్కిల్‌లో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు డివిజన్లు ఉన్నాయి. డివిజన్లు, మండల పునర్విభజన, ఏఈల పోస్టుల కేటాయింపునకు త్వరలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు దృష్టిసారించారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేసి.. 15 రోజుల్లో పునర్విభజన ప్రక్రియ పూర్తికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం విద్యుత్తు శాఖ తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న నగరి, కార్వేటినగరం మండలాలను చిత్తూరు జిల్లా సర్కిల్‌కు కలపనున్నారు. చిత్తూరు రూరల్ డివిజన్ పరిధి తక్కువగా ఉన్నందున.. ఈ డివిజన్‌కు కొన్ని మండలాలను విలీనం చేయనున్నట్లు తెలిసింది. ఈ తరుణంలోనే సర్కిల్‌లో కొత్తగా మరో రెండు ఈఆర్వో సెక్షన్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

నాణ్యమైన విద్యుత్తు సరఫరానే లక్ష్యం



ఎస్ఈ ఇస్మాయిల్

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: వినియోగదారులకు అంతరాయం లేని.. నాణ్యమైన విద్యుత్తు సరఫరానే తమ లక్ష్యమని విద్యుత్తు శాఖ చిత్తూరు జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించాలనే సంకల్పంతో సర్కిల్‌ను రెండుగా విభజించి.. గిరింపేటలోని రూరల్ డివిజన్ కార్యాలయంలో చిత్తూరు జిల్లా సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం కార్యాలయంలో సర్కిల్ తొలి ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఆ శాఖ ఇంజినీర్లు, అధికారులు ఘనంగా సత్కరించారు. తిరుపతి జిల్లా ఎస్ఈ సురేంద్రనాయుడు, కార్పొరేట్ కార్యాలయం నాణ్యత ప్రమాణాల సీజీఎం మురళీ, ఈఈలు మునిచంద్ర, సురేష్‌బాబు, అమరబాబు, జగదీష్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులను తిప్పుకోవద్దు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై జేసీ విద్యాధరితో కలసి.. మంగళవారం జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. గ్రీవెన్స్‌లో రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నట్లు చెప్పారు. పరిష్కారం కాలేని సమస్యకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అర్జీదారునికి ఎండార్స్‌మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్, గృహ నిర్మాణ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

- తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని.. ఆధార్‌కార్డు లేని గిరిజనులకు నూతన కార్డుల్ని మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

సీఎం సహాయనిధికి రూ.86,100 విరాళం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం తరఫున జిల్లా నాయకులు రూ.86,100 విరాళం అందజేశారు. చెక్కును కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. డీఈవో దేవరాజులు, డీవైఈవో చంద్రశేఖర్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణకుమార్, రవీంద్రరెడ్డి, కోశాధికారి హేమాద్రి, రాష్ట్ర కౌన్సిలర్లు, సభ్యులు పాల్గొన్నారు.



పాడె మోయాలంటే పాడెక్కేందుకు సిద్ధపడాలా..?

సహచరుని అంత్యక్రియల్లో పాడెను మోయాలంటే తాము సైతం పాడెను ఎక్కేందుకు తెగించాల్సిన పరిస్థితి నాగలాపురం మండలంలోని కస్తూరినాయుడుకండ్రిగలో కనిపించింది. స్థానిక ఎస్టీకాలనీకి చెందిన శంకర్(52) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా.. ఆయన అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, బంధువులు పూర్తి చేశారు. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లే దారిలో అరణియార్ నది కాలువ ప్రవహిస్తుండటంతో నడుములోతు నీటిలో ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు చేరువగా పాడెను తీసుకెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందట కారణిలో ఒకరి అంత్యక్రియలకు వెళ్లిన వడివేలు నీటిలో కొట్టుకుపోయి మృతి చెందగా.. తాజాగా ఇదే పరిస్థితి సమీప గ్రామాల్లోనూ నెలకొనే పరిస్థితులు భయాందోళనలు కలిగిస్తున్నాయి.

న్యూస్‌టుడే, నాగలాపురం



ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌డీసీ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను మంగళవారం ఎన్నుకున్నారు. పద్మావతిపురంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు సరేష్‌బాబు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రాజు, ఉపాధ్యక్షుడుగా వరదాంజనేయులు, కార్యదర్శిగా సోమశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ధనలక్ష్మి, కోశాధికారిగా రవీంద్రరెడ్డితో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



దృష్టి లోపం.. పిల్లలకు శాపం

- చరవాణులతో అధిక ముప్పు
- పరీక్షల్లో వెలుగు చూస్తున్న వైనం

నయనం ప్రధానం అన్న నానుడితో వాటికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. కంటి చూపు బాగుంటేనే దేనినైనా సాధించగలం. అయితే ప్రస్తుతం చిన్న పిల్లల్లోనూ దృష్టి లోపాలు అధికమైనట్లు వైద్య పరీక్షల్లో స్పష్టమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్కూల్ ఆఫ్ హెల్త్ ఐ స్క్రీనింగ్' కార్యక్రమంలో ఈ విషయం వెల్లడైంది. ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలు అక్టోబర్ 31 వరకు జరగనున్నాయి. సమగ్ర శిక్షా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆప్తమాలిక్ అసిస్టెంట్లతో బృందాలుగా పరీక్షలు చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పలమనేరు, పుంగనూరు

పరీక్షలు చేసిన పాఠశాలలు 534

చరవాణికి అతుక్కుపోవడమే..

కొవిడ్ సమయంలో పాఠశాలలకు సెలవు ఇవ్వడం, ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. దీంతో చిన్నారుల సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయింది. ప్రస్తుతం పాఠశాలలు నిర్వహిస్తున్నా.. ఇళ్లకు చేరిన తర్వాత వీడియో గేమ్స్, సినిమాలు తదితరాలకు చరవాణినే వినియోగిస్తున్నారు. ఎక్కువ సమయం సెల్‌ఫోన్ స్క్రీన్ చూడటం వల్ల దృష్టి లోపాలు వస్తున్నట్లు వైద్యులు గుర్తించారు. పిల్లల్లో చరవాణి వినియోగం పెరగటం, మరికొందరు తల్లిదండ్రులే పిల్లల చేతికి చరవాణిలు ఇవ్వడం, చంటి పిల్లల ఏడుపు మాన్పించడానికి సైతం చరవాణిని చూపడం వినియోగానికి ప్రధాన కారణాలని నిపుణులు చెబుతున్నారు.

ఉచితంగా అద్దాలు, శస్త్రచికిత్సలు

గంటల తరబడి చరవాణులు చూస్తుండడంతో కంటి చూపు దెబ్బతింటోంది. మరో వైపు పోషకాహారం తీసుకోకపోవడమూ కారణమే. ఫలితంగా కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అందుకే ప్రభుత్వం బడిపిల్లల్లో కంటి లోపాలు గుర్తించి అవసరమైన వారికి కళ్లజోడు ఇవ్వాలని నిర్ణయించింది. సమస్య తీవ్రంగా ఉన్న వారికి శస్త్ర చికిత్సలు చేయించాలనేది ప్రభుత్వ లక్ష్యం. తల్లిదండ్రులు సైతం సెల్‌ఫోన్ వినియోగంపై దృష్టి పెట్టి అత్యవసరమైతేనే వినియోగించేలా, కంటి చూపు మెరుగుపడేలా పౌష్టికాహారాన్ని అందించడం అవసరం. వైద్యుల సూచనలు పాటించాలి.



పెద్దపంజాణి మండలం కరసనపల్లెలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తమాలిక్ అసిస్టెంట్ రహ్మత్‌ఖాన్ (పాతచిత్రం)

త్వరగా పూర్తి చేస్తాం

జిల్లాలో సాగుతున్న కంటి పరీక్షలు త్వరగతిన పూర్తి చేస్తాం. విద్యార్థుల్లో అంధత్వాన్ని నివారించడమే లక్ష్యం. అద్దాలు అవసరమైన ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. **- అర్పిత, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజరు, చిత్తూరు**

నేత్రపరీక్షలు చేసుకున్న విద్యార్థులు 41,063 మంది

కళ్లద్దాలు అవసరమైనవారు 1,869 మంది

'మొదటి ర్యాంకు వచ్చినా పీహెచ్‌డీ ప్రవేశం లేదు'

ఈనాడు డిజిటల్, తిరుపతి: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఎస్వీయూ ఆధ్వర్యంలో 2023-24 ఏడాదికి గాను నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశాల్లో అన్యాయం జరిగినట్లు అనకాపల్లి జిల్లాకు చెందిన బండారు మోహన్ ఆరోపిస్తున్నారు. లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీకిగాను 139 మార్కులతో మొదటి ర్యాంకు సాధించినా సీటు రాలేదని, ఆ విభాగంలో ఆరు ఖాళీలు ఉండగా తన తరువాతి ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు సీట్ కేటాయించారన్నారు. దీనిపై ఏపీ ఆర్‌సెట్ కన్వీనర్‌ను సంప్రదించగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అంటూ సరైన సమాధానం చెప్పలేకపోయారని, అర్జీని దరఖాస్తు దాఖలు చేసినట్లు వెల్లడించారు.

ఎస్వీయూలో స్పాట్, ప్రత్యేక ప్రవేశాలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ల గడువు తేదీని ఈనెల 21 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. వివరాలకు డీవోఏ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును 0877-2248589లో సంప్రదించాలని సూచించారు. ఎంటెక్‌లో కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ కోర్సుల్లోనూ ప్రత్యేక పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

నేర్పు.. జలవనరుల కూర్పు

తిరుపతి ఐఐటీకి జాతీయ స్థాయి గుర్తింపు



పచ్చదనం విస్తరణతో ఐఐటీ భవనాలు

శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే: 'వృథా నీటికి అడ్డుకట్ట వేయడం.. ఆ నీటితో అద్భుతమైన పచ్చదనం విస్తరించేలా చేయడంలో తిరుపతి ఐఐటీ అద్భుతమైన నేర్పును కనబర్చింది.' చూడగానే ఆకట్టుకునే రీతిలో ప్రాంగణంలో చేపట్టిన జల సంరక్షణ కూర్పునకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సాధించడం విశేషతను సంతరించుకుంది. జలం జీవన ప్రగతికి నిదర్శనం అన్న అక్షర సత్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చాటడం జల సంరక్షణలో ఆదర్శ ప్రాయంగా నిలిచి ఉత్తమ ఫలితాలను సాధించిన గ్రామాలు, సంస్థల కృషిని కేంద్ర జల శక్తి శాఖ గుర్తించింది. 2023వ సంవత్సరానికి నిర్వహించిన పోటీల్లో ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో జలసంరక్షణ కూర్పునకు జాతీయ స్థాయిలో స్పెషల్ మెన్షన్ అవార్డును దక్కించుకోవడం విశేషతను సంతరించుకుంది.


సంరక్షణే లక్ష్యం

జల సంరక్షణ ప్రధాన లక్ష్యంగా ఐఐటీ కృషికి సర్వత్రా ప్రశంసలు వచ్చాయి. ప్రధానంగా ఐఐటీ భవనాలన్నీ కొండలను ఆనుకుని ఉన్నాయి. వర్షాకాలంలో ఆ కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీరంతా గతంలో వృథా అవుతూ వచ్చేది. ఐఐటీ భవన నిర్మాణాలు చేపట్టాక ఆ నీటిని పూర్తి స్థాయిలో సంరక్షించాలన్న లక్ష్యంతో ప్రాంగణంలో రెండు పెద్ద చెరువులను మరింత అందంగా తీర్చిదిద్దింది. ఇక్కడ 8.37 కోట్ల లీటర్ల నీటి లభ్యత ప్రధానాంశంగా వంద శాతం జలసంరక్షణకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా ఇక్కడ నీటి నిల్వలతో ప్రాంగణంలో 5200 మొక్కలను నాటారు. ఇవన్నీ దీర్ఘకాలంతో పాటు ఏపుగా ఎదిగే వాటికి ప్రాధాన్యత ఇచ్చి నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తూ పచ్చదనం విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంగణం చుట్టూ ఉన్న అటవీ ప్రాంతానికి అనుబంధంగా ఈ మొక్కల పెంపకం మరింత ఆహ్లాదాన్ని పంచేలా ఐఐటీకి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది.



మొక్కలు, నిల్వ నీటితో ఆహ్లాదకరంగా ఐఐటీ ప్రాంగణం

దత్తత గ్రామాల్లోనూ..



పచ్చదనం ఉంటే ఆహ్లాదం కన్పిస్తుంది. ప్రస్తుతం జల సంరక్షణ చర్యల్లో ఐఐటీ ప్రాంగణంలోనే కాకుండా తాము దత్తత తీసుకున్న అన్ని గ్రామాల్లోనూ మొక్కలు నాటించాం. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల సహకారంతో జలసంరక్షణ. . పచ్చదనం విస్తరణ లక్ష్యంగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాం. జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది.

- సత్యనారాయణ, డైరెక్టర్, ఐఐటీ తిరుపతి



ఎంపికైన బాలబాలికలతో పీడీలు

జిల్లా కత్తిసాము జట్ల ఎంపిక

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 ఫెన్సింగ్(కత్తిసాము) జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వసంతవాణి తెలిపారు. చిత్తూరులోని మెసానికల్ మైదానంలో మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన ఆటగాళ్లు ఈ నెల 17 నుంచి 19 వరకు నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు. పీడీలు రవీంద్రరెడ్డి, సెల్వపాండ్యన్, కృష్ణ, సిరాజ్, బాబు, నూరుద్దీన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప కమ్మీ తరలింపు అడ్డుకున్న రైతులు

- సమస్యలు పరిష్కరించి తీసుకెళ్లాలని డిమాండ్
- అధికారుల జోక్యంతో సమసిన వివాదం

సోమల, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్‌ఆర్ సంస్థకు చెందిన మిగిలిపోయిన ఇనుపకమ్మీ తరలింపును నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. సమస్యల పరిష్కరించి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన సోమల మండలం ఆవులపల్లె జలాశయం నిర్మాణ పనుల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. హైకోర్టు ఉత్తర్వులతో పీఎల్‌ఆర్ కంపెనీ ప్రతినిధి.. నిల్వ చేసిన ఇనుపకమ్మీని తరలించేందుకు వాహనాలు పిలిపించారు. ఈ విషయం తెలుసుకొన్న నిర్వాసిత రైతులు అక్కడికి చేరుకున్నారు. సంస్థ ప్రతినిధులు సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. సీఐ రాంభూపాల్ ఎస్ఐలు శివశంకర్, షేక్‌షావలీతో పాటు అదనపు బలగాలు అక్కడికి చేరుకున్నారు. పీఎల్‌ఆర్ సంస్థ ప్రతినిధి హైకోర్టు ఉత్తర్వుల మేరకే కమ్మీని తరలిస్తామని సీఐకు వివరించారు. రైతులు మాట్లాడుతూ పాతసీతమ్మచెరువు కట్ట ఏ విధంగా ఉందో.. అదే స్థలంలో కట్ట నిర్మించాలని, అప్పట్లో కొంత మంది రైతులకు చెందిన 911 ఎకరాలను నిషేధిత భూములుగా మార్చడంతో 1బీ, అడంగల్ రావడం లేదన్నారు. దీంతో బ్యాంకుల్లో రుణాలు రెన్యూవల్ చేసుకోలేకపోతున్నామని.. సమస్యలు పరిష్కరించిన తర్వాతే తీసుకెళ్లాలని డిమాండు చేశారు. ఈ సమాచారాన్ని సీఐ తహసీల్దార్ బెన్నురాజ్‌కు చరవాణిలో తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకొన్న తహసీల్దార్ ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీనివాసులురాజుతో మాట్లాడారు. రైతుల భూముల రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు తహసీల్దార్ రైతులకు తెలిపారు. దీంతో వివాదం సమసిపోయింది. కంపెనీ ప్రతినిధి లారీల్లో కమ్మీని తరలించారు.



రైతులతో మాట్లాడుతున్న సీఐ రాంభూపాల్, తహసీల్దార్ బెన్నురాజ్

మహిళ మెడలో గొలుసు చోరీ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఇంటి ముందు కూర్చొని ఉన్న మహిళతో మాటలు కలిపిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించారు. ఈ ఘటన శ్రీకాళహస్తి రెండో పట్టణ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. స్థానిక కుందేటివారివీధికి చెందిన సుశీల ఇంటి ముందు కూర్చొని ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె వద్దకు వచ్చి సమాచారం అడుగుతున్నట్లు మాటలు కలిపారు. ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కోవడంతో సగభాగం తెగిపోవడంతో దాన్ని తీసుకుని దుండగులు పరారయ్యారు. చోరీకి గురైన గొలుసు పది గ్రాములు ఉంటుంది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బకాయిలు చెల్లించే వరకు ఎవరినీ అనుమతించం



రైతు, కార్మిక సంఘాల నాయకులకు సర్దిచెబుతున్న పోలీసులు

నింద్ర, న్యూస్‌టుడే: నింద్ర మండల పరిధిలోని నేటమ్స్ షుగర్స్‌కి గతంలో అప్పు ఇచ్చిన ముంబయికి చెందిన ఎస్టీసీసీఐ కంపెనీ ప్రతినిధులు ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోడానికి ఇటీవల యాక్షన్ నోటీసు ఇచ్చారు. దీంతో స్థానిక రైతులకు రూ.37కోట్లు, కార్మికులకు సుమారు రూ.10 కోట్ల మేర యాజమాన్యం చెల్లించాల్సి ఉందని.. చెల్లించే వరకు ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించమని మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో రైతులు, కార్మికులు ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీలో ఎస్టీసీఐ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బందిని సైతం బయటకు పంపించారు. సిబ్బంది కంపెనీ ప్రతినిధులకు సమాచారం చేరవేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్టీసీఐ కంపెనీ తరఫున వేసిన యాక్షన్ నోటీసును ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు ఆ సంస్థ డీజీఎం బబిత రైతు సంఘాల నాయకులకు తెలిపారు. అనంతరం ఆ సంస్థ ఎండీతోనూ ఫోన్లో మాట్లాడించారు. విజయపురం ఎస్సై బలరాం సమక్షంలో నింద్ర, విజయపురం పోలీసులు ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రవేశించి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. దీంతో ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రైతులు, కార్మికులు ప్రకటించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	135
రిటైల్	157
లేయర్	120
బ్రాయిలర్స్	228
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	259
లేయర్ మాంసం	204

వివాహిత ఆత్మహత్య

యాదమరి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వేణుగోపాలపురంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సత్తాజ్(27)ను 2013లో తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి ముస్లిం కండ్రిగకు చెందిన సి.ఎం.అమీర్‌జాన్‌కు ఇచ్చి వివాహం చేశారు. భర్త అమీర్ తాగుడుకు బానిస కావడంతో గొడవ పడి ఏడేళ్లుగా సత్తాజ్ వేణుగోపాలపురంలోని పుట్టింట్లో ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. మోర్దానపల్లి వద్ద అమరరాజ గ్రోత్ కారిడార్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. ఏళ్లు గడిచినా భర్తలో మార్పు రాకపోవడం, పిల్లలు పెద్దవారు అవుతుండటంతో మనస్తాపం చెందిన సత్తాజ్ సోమవారం సాయంత్రం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు సంతగేటు పీహెచ్‌సీకి, అక్కడి నుండి చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి సోదరుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఈశ్వర్ తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న నలుగురి అరెస్టు



నిందితులను చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పార్థసారథి, గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గుట్టుగా గంజాయి సాగు చేస్తూ విక్రయాలకు పాల్పడుతున్న నలుగురిని కుప్పం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పార్థసారథి విలేకర్లకు వివరాలు వెల్లడించారు. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెకు చెందిన ఆదికేశవులు, ఓ డిగ్రీ విద్యార్థి గంజాయి తాగుతుండగా.. వారిని పట్టుకుని విచారించగా.. సాగు గుట్టు రట్టు అయినట్లు తెలిపారు. రామకుప్పం మండలం 89.పెద్దూరు గ్రామంలోని అంజప్ప పొలంలో 50 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారు. ఆ గంజాయిని అదే గ్రామానికి చెందిన ధనరాజ్‌కు ఇవ్వగా, అతని నుంచి ఆదికేశవులు, డిగ్రీ విద్యార్థి కొనుగోలు చేసినట్లు గుర్తించామని పేర్కొన్నారు. వీరు గంజాయి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. సమాచారం మేరకు రెవెన్యూ అధికారుల సమక్షంలో దాడి చేసి అంజప్ప పొలంలోని 50 మొక్కలను ధ్వంసం చేశారు. వాటి నుంచి వచ్చిన గంజాయి స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. యువత మత్తుకు బానిసలు కావొద్దని తెలిపారు. గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రుణ యాప్‌ల లింకులతో రూ.4.9 లక్షల స్వాహా

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మీ పేరుతో ఉన్న పార్సిల్‌లో మెడికల్ డ్రగ్స్ ఉన్నాయని, సైబర్ పోలీసుల విచారణ అంటూ రూ.లక్షల్లో నగదు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. రూరల్ పీఎస్ పరిధిలోని ఎంకేనాయుడు కాలనీలో రావెళ్ల నరేంద్ర నివాసం ఉంటున్నారు. బెంగళూరులోని ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈనెల 10న ఓ ఫోన్ నుంచి కాల్ వచ్చింది. తాము ముంబయి కొరియర్ సర్వీసు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పేరుతో ఇరాన్ వెళ్తున్న పార్సిల్‌లో మెడికల్ డ్రగ్స్‌ను గుర్తించి దుబాయ్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సైబర్ పోలీసుల విచారణ అంటూ స్కైయాప్‌లో వీడియో కాల్‌చేసి బెదిరించారు. లోన్ యాప్‌ల నుంచి ఐదు లింకుల ద్వారా అతని ఐసీఐసీఐ ఖాతాను అనుసంధానం చేస్తూ రూ.5 లక్షల రుణం ఇప్పించారు. అందులోని రూ.4.90 లక్షలు వారి ఖాతాకు బదలాయించుకున్నారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

నిధుల విడుదల తాత్కాలికంగా నిలుపుదల

ఈనాడు-తిరుపతి: తిరుమల నడకదారితో పాటు కనుమ దారుల్లో వన్యమృగాలను పసిగట్టడంతోపాటు వాటిని పట్టుకునేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తితిదే నుంచి రూ.3.50 కోట్ల నిధుల విడుదలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘాట్‌రోడ్డు రక్షణగోడను ఢీకొన్న వ్యాన్



ప్రమాదానికి గురైన వ్యాన్ సమీపంలోనే గాయపడిన డ్రైవర్ వద్ద భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: మొదటి ఘాట్‌రోడ్డులో టెంపో ట్రావెలర్ వ్యాన్ ప్రమాదానికి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన లోకనాథం 12 మంది కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 12న తిరుపతికి వచ్చారు. వెంకటేష్ అనే డ్రైవర్‌తో ఉన్న పరిచయంతో టెంపో ట్రావెలర్ వ్యాన్‌ను మాట్లాడుకుని ఇక్కడి తిరుమలకు చేరుకున్నారు. దర్శనానంతరం మంగళవారం ఉదయం తిరుమల నుంచి తిరుపతికి వస్తుండగా ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్‌కావడంతో వాహనం రక్షణ గోడను ఢీకొంది. డ్రైవర్ వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కాగా, నలుగురు భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. రాకపోకలను పునరుద్ధరించారు.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

రైతుల ప్రయోజనానికే ఈ-పంట నమోదు

వడమాలపేట, న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనానికే ఈ-పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాదిరేడు ఈ-పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఆయన మట్లాడుతూ ఖరీఫ్-2024 సీజన్‌లో ఈ-పంట నమోదు చేసుకొన్న రైతులకు సామాజిక తనిఖీలో సందేహాలు ఉంటే గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల వ్యవసాయాధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోరంబోకు స్థలాల్లో గృహాలకు పన్ను వేయొద్దు

నగరి: పట్టణ పరిధిలో కాలువ, చెరువు, రోడ్డు పోరంబోకు స్థలాలలో అక్రమంగా గృహాలు నిర్మించిన వారికి పన్ను వేయరాదని పురపాలక ఛైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డికి మంగళవారం వారు వినతిపత్రం అందించారు. కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక గిరింపేట బాలాజీనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. **-స్థానికులు**

సమాధానం: వీధి దీపాల మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం. **-వెంకటరామిరెడ్డి, నగరపాలక ఎంఈ**

గుడిపాల, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో పానాటూరు గ్రామ సమీపంలో పెద్ద గుంత ఏర్పడింది. ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. **-అన్నాదురై, స్థానికుడు**

సమాధానం: గుంతను పూడ్చేందుకు చర్యలు చేపడతాం. **-దస్తగిరి, ఆర్‌అండ్‌బీ, డీఈ**

భక్తిశ్రద్ధలతో పడిపూజ



నగరి, న్యూస్‌టుడే: నగరి అయ్యప్ప దేవాలయంలో మంగళవారం పడిపూజ నిర్వహించారు. అయ్యప్పకు ప్రత్యేక పుష్పాలంకరణతో అభిషేకాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కన్నప్ప, మునస్వామి, రమేష్‌బాబు, సురేష్, దుర్గాప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

సాయినాథునికి క్షీరాభిషేకం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని కట్టమంచిలో వెలసిన షిర్డీ విశ్వ సాయిబాబా మందిరంలో స్వామివారి మూలవర్లకు మంగళవారం సర్వ క్షీరాభిషేక సేవ నిర్వహించారు. షిరిడీ సాయిబాబా మహాసమాధి చెందిన రోజును పురస్కరించుకుని నిర్వహించిన సేవలో మందిరం ట్రస్టీ సీకే లావణ్య, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



ఎస్పీ మణికంఠకు చెక్కు అందిస్తున్న విశ్రాంత పోలీసు సంఘం సభ్యులు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: వరద బాధితులకు తమవంతు సాయంగా విశ్రాంత పోలీసు సంఘం సభ్యులు ముందుకు వచ్చారు. ఎస్పీ మణికంఠను కలసి రూ.35 వేల చెక్కును అందించారు. విశ్రాంత సీఐ ఫెడ్రిక్, ఎస్సై మురళిలు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని, బాధితులను ఆదుకోవడానికి తమ వంతు సాయం అందిస్తున్నట్లు చెప్పారు.

టిడ్కో ఇళ్లు దక్కేనా?

కట్టిన సొమ్ము వచ్చేనా?

కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

ఐదేళ్ల కిందట అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు ఈసారి కూటమి ప్రభుత్వ హయాంలో అందుతాయని లబ్ధిదారులు ఎంతో ఆశతో ఉన్నారు.. నాడు నిర్మించిన గృహాలను ఆపై అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.. ఫలితంగా లబ్ధిదారులు అవస్థలు చెప్పనలవికావు.. కనీసం ఆయా భవనాల వైపు నాటి పాలకులు కన్నెత్తి చూడలేదంటే పరిస్థితి ఎలాఉందో వేరే చెప్పనక్కర్లేదు.

- నగరి, న్యూస్‌టుడే



నగరి పట్టణంలో గృహ నిర్మాణాలకు తీసిన పునాదులు

పట్టణంలో ఇలా..

నగరి పురపాలక సంఘం పరిధిలో 27 వార్డులు ఉన్నాయి. వీటిలో సొంతింటి కోసం దరఖాస్తు చేసుకుని గతంలో అర్హులుగా ఎంపికైన వారి సంఖ్య 826 మంది. లబ్ధిదారులుగా ఆన్‌లైన్‌లో నమోదయ్యాక.. ఇందుకు వారు ముందస్తుగా సొమ్ము చెల్లించారు. 298 మంది లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. ❖ 300 చదరపు అడుగుల ఇంటికి 116 మంది రూ.58 వేలు చెల్లించారు. ❖ 360 చ.అ ఇంటి కోసం 104 మంది రూ.13 లక్షలు చెల్లించారు. ❖ 430 చ.అ ఇంటి కోసం 78 మంది రూ.19.5 లక్షలు డీడీల రూపంలో చెల్లించారు. ఇలా మొత్తం రూ.33.08 లక్షల నగదును లబ్ధిదారులు ప్రభుత్వానికి చెల్లించారు.

528 గృహాలకు పునాదులు..

2019లో పట్టణ శివారులోని నాగరాజుకుప్పం వద్ద ప్రత్యేక స్థలం ఎంపిక చేసి గృహ సముదాయ నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. 528 గృహాలు నిర్మించడానికి అప్పట్లో నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారులు అందుకు సంబంధించిన పునాదులు వేసి పనులు ప్రారంభించారు. తీరా ఎన్నికలు ముగిసి వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్ధాంతరంగా ఆయా గృహాల పనులు ఆగిపోయాయి. గుత్తేదారులు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. ఇల్లు లేకున్నా, తాము కట్టిన సొమ్ము వెనక్కి ఇవ్వాలని అధికారులు చుట్టూ తిరిగి అలసి పోయారు. ప్రస్తుతం మళ్లీ తెదేపా కూటమి అధికారంలోకి రాగానే వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

త్వరలో చెల్లిస్తాం..

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం త్వరలో లబ్ధిదారులు కట్టిన సొమ్ము తిరిగి చెల్లించే అవకాశం ఉంది. టిడ్కో ఇళ్లు పునర్నిర్మించే ఆలోచనపై స్పష్టమైన ఆదేశాలు లేవు.

-కె.వి.కృష్ణారెడ్డి, కమిషనర్, నగరి

స్థానిక పాలనపై అవగాహన అవసరం

పెనుమూరు, న్యూస్‌టుడే: పంచాయతీ పాలకులకు గ్రామ పరిపాలనపై అవగాహన అవసరమని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశపు మందిరంలో మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వర్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్లు ప్రభుకిరణ్‌కుమార్, నిర్మలదేవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

▸ **విజయపురం, న్యూస్‌టుడే:** మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ తరగతులను మంగళవారం ఎంపీడీవో రమణప్రకాష్ ప్రారంభించారు.

▸ **నిండ్ర, న్యూస్‌టుడే:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం



సంతపేటలో బుడమాల చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు నగరం: వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. సంతపేట బుడమాల చెరువులో నీటి నిల్వను పరిశీలించారు.

పుత్తూరులో భారీ వర్షం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరులో మంగళవారం తెల్లవారుజాము నుంచి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. సాయంత్రం భారీ వర్షం పడింది. ఈ వర్షాలకు చెరువులకు నీరు చేరే అవకాశం ఉంది. పంటల సాగుకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో పురపాలక అధికారులు పట్టణంలో రాత్రి గస్తీ ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూశాఖ అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు.

అధికారుల సూచనలు పాటించాలి: ఎమ్మెల్యే

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నీవా నది పరివాహక ప్రాంతాల ప్రజలు, గంగినేని చెరువు కాలువ వెంబడి ఉన్న ప్రజలు, లోతట్టు, ఇతర శివారు ప్రాంతాల్లోని చెరువుల వద్ద నివాసం ఉన్న వారు అధికారుల సూచనలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 94910 77356, 08572242777, నగర పాలక సంస్థ కంట్రోల్ రూమ్ నంబరు 98499 07885 నంబర్లకు ఫోన్ చేయాలని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుని కూటమి నాయకులు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: పూరిగుడిసెల్లో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. కార్వేటినగరంలోని చాకలివానిగుంట ఎస్టీ కాలనీని మంగళవారం ఆయన పరిశీలించారు. కాలనీలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న వారిని సమీపంలోని పాఠశాలలోకి తరలించారు.



చాకలివానిగుంట ఎస్టీ కాలనీవాసులను సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచిస్తున్న ఎంపీడీవో చంద్రమౌళి

వాగులు, వంకల్లోకి దిగొద్దు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: బుధ, గురువారం నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని, వాగులు, వంకల్లో దిగకూడదని సీఐ హనుమంతప్ప తెలిపారు. కార్వేటినగరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు అత్యవసరమైతే కార్వేటినగరం సీఐ చరవాణి నంబరు 9440900689, ఎస్సై నంబరు 9440900690ను సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాలల్లో సహాయక శిబిరాలు

నగరి, న్యూస్‌టుడే: నగరిలో మంగళవారం ఉదయం నుంచి నిరవధికంగా వర్షం కురుస్తోంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పురపాలక కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్ బృందం పట్టణంలోని లింగేశగుంట, నగరిపేట, ఇందిరమ్మ కాలనీ, కసింమిట్ట కాలవ ప్రాంతాలలో ప్రజలను నేరుగా కలిసి అప్రమత్తం చేశారు. చింతలపట్టడ, కసింమిట్ట, నగరిపేట పాఠశాలల్లో సహాయక శిబిరాలు ఏర్పాటు చేశామని, ఇబ్బందిగా ఉన్న వారు శిబిరాలకు తరలిరావాలని చెప్పారు.



లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న పురపాలక కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్ తదితరులు

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని 35-యర్లంపల్లె పంచాయతీ బెస్తపల్లెలో డెంగీ కేసును గుర్తించారు. ఈ క్రమంలో వైద్య బృందం మంగళవారం గ్రామాల్లో పర్యటించి ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, రామచంద్రారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ



వేణుగోపాలపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కూటమి నేతలు, అధికారులు

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టిందని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. పుత్తూరు మండలం తడుకు పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురంలో రూ.40లక్షలతో సీసీ రోడ్లు, రూ.4.50లక్షలతో నిర్మించనున్న మురుగు కాలువ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ అంజేరయ్య, ఏపీవో భార్గవి, సర్పంచి వెంకటేశు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు కొత్త సొబగులు



ఐరాల: పత్తిపాటివారిపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు

ఐరాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగతో గ్రామాల్లో కొత్త సొబగులు సంతరించుకోనున్నట్లు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ తెలిపారు. మండలంలోని పొలకల, మొరంపల్లె, 35-యర్లంపల్లె, పుత్రమద్ది, బొమ్మసముద్రం పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఐరాల మండలంలో సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, డీఎల్‌డీవో రవికుమార్, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, తెదేపా మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నిండ్ర, న్యూస్‌టుడే: ఒరూరుపేటలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజలు నిర్వహించారు. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, ఈవోపీఆర్డీ లక్ష్మీపతి, నిండ్ర మండల తెదేపా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కావనూరులో నేడు..

కావనూరు పంచాయతీలో బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరుకానున్నట్లు తెదేపా మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి

పాలసముద్రం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే థామస్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యేను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు చెన్నైలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పల్లెపండుగ కార్యక్రమాన్ని ప్రతి మండలంలో విజయవంతం చేయాలన్నారు.

▸ **వెదురుకుప్పం:** కొమరగుంట, తిరుమలయ్యపల్లె, ఇతర పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఎంపీడీవో అమరనాథ్, అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

నిండ్ర, న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జీవనోపాధి కోల్పోయిన నిరుపేద కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని పాదిరి ఆది ఆంధ్రవాడలో స్థానిక తెదేపా యువ నాయకుడు నంద కూరగాయలు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.



కూరగాయలు అందజేస్తున్న నంద తదితరులు

మద్యం స్వాధీనం: వ్యక్తి అరెస్టు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. చిత్తూరు మండలం నరిగిపల్లె గ్రామం వైపుగా వెళుతున్న ఓ కారును అడ్డుకుని తనిఖీ చేయగా 720 మద్యం పొట్లాలు ఉన్న 15 పెట్టెల కర్ణాటక మద్యంను గుర్తించారు. మద్యం, కారును స్వాధీనం చేసుకుని శివకుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. కేసులో చురుగ్గా పాల్గొన్న ఎస్సై రమేష్‌బాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ద్విచక్ర వాహన దొంగ..

చిత్తూరు(నేరవార్తలు): నగరంలో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వినోద్‌కుమార్ అలియాజ్ వాసును అరెస్టు చేసినట్లు చిత్తూరు రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం కాణిపాకం మలుపు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా.. ఓ వాహనదారుడు పోలీసులను చూసి పారిపోగా వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. విచారించగా వాహనానికి సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని, దొంగ వాహనంగా తేలిందన్నారు. మరో రెండు దొంగ వాహనాలు కూడా అతని వద్ద ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అంధులను చిన్నచూపు చూడొద్దు



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న దివ్యాంగులు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రహదారులపై వాహనాల్లో వెళ్లే వారు అంధులను చిన్న చూపు చూడకూడదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్‌ది బ్లైండ్ ఇండియా చిత్తూరు యూనిట్ అధ్యక్షుడు మణిగండన్ అన్నారు. నగరంలోని గాంధీ విగ్రహ కూడలిలో మంగళవారం అంధులు 'వరల్డ్ వైట్ కేన్ డే' సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంధులు చూడలేకపోయినా వైట్ కేన్ సాయంతో ధైర్యంగా రోడ్లపై అందరితో సమానంగా నడుస్తుంటారని చెప్పారు. అలా కర్ర సాయంతో నడిచే వారిని చిన్న చూపు చూడకూడదని, వారి నమ్మకాన్ని గౌరవిస్తూ కుదిరితే సాయం చేయాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసన్, భాస్కర్, గీత, ప్రధాన కార్యదర్శి భూపతి, కార్యదర్శులు గణేష్, రాధ, యువత కార్యదర్శి మురుగదేవి, కోశాధికారి దిల్లీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రేమ చూపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భవిత కేంద్రం సభ్యులు, ఉపాధ్యాయులు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ప్రేమ, వాత్సల్యం చూపాలని ఎంఈవో తిరుమలరాజు పేర్కొన్నారు. పుత్తూరు భవిత కేంద్రంలో డైస్లెక్సియాపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-2 బాలసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్సు ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యకుమారి, స్పెషల్ టీచర్ జగదీశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు. **వడమాలపేట, న్యూస్‌టుడే:** వడమాలపేటలో ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవోలు పద్మావతి, తులసీరాంలు, ప్రధానోపాధ్యాయురాలు కరుణానవనీతం, ఉపాధ్యాయులు హేమలత, విజయకుమారిలు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు: తప్పిన ప్రమాదం

చిత్తూరు గ్రామీణ: దిగువమాసాపల్లె పంచాయతీ బంగారెడ్డిపల్లెకు చెందిన కళావతి ఇంటి పైకప్పు మంగళవారం కురిసిన వర్షానికి కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని కుటుంబసభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

గుంతల మార్గం
నిత్యం నరకం

యాదమరి, న్యూస్‌టుడే: చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. జోడిచింతల పోలీసుస్టేషన్ నుంచి రాష్ట్ర సరిహద్దు కన్నికాపురం వరకు రహదారి గోతులమయమైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్ర వాహనదారులు ఈ దారిలో వెళ్లేందుకు భయపడుతున్నారు. భారీ వాహనాలు ఈ గుంతల్లో చిక్కుకుంటే వాటిని తొలగించడానికి కొన్ని గంటలు నిరీక్షించాల్సి వస్తోంది. గత ఐదేళ్లుగా రహదారి ఇలాగే ఉన్నా బాగు చేసేందుకు అదిగో ఇదిగో అన్న మాటలు తప్ప బాగు చేసింది లేదు. ప్రస్తుతం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తక్షణం రహదారిని బాగు చేయకుంటే ఈ మార్గంలో వాహన రాకపోకలు ఆగిపోయే పరిస్థితి నెలకొంది.



కుంటను తలపిస్తున్న అంతర్రాష్ట్ర రహదారి

రోజూ ప్రమాదాలే



పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరు-చిత్తూరు మార్గంలో ఉగ్రాణంపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకు సమీపంలో గుంత ప్రమాదకరంగా మారింది. ఆరు నెలల కిందట ఈ మార్గంలో రహదారి మరమ్మతు పనుల్లో భాగంగా తారు వేశారు. ఆ సమయంలో ఉగ్రాణంపల్లెలో కొంత భాగం సిమెంటు రోడ్డు నిర్మించారు. తారు రోడ్డు, సిమెంటు రోడ్డు కలిసే ప్రాంతంలో మరమ్మతు చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో ఆ ప్రాంతంలో వర్షం పడితే చాలు నీరు నిలిచి పెద్ద కుంటను తలపిస్తోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రతి రోజు ఇక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎదురుగా వాహనాలు వస్తే పక్కకు వెళ్లిన సమయంలో వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. గతంలో ఓ సారి మరమ్మతు చేసినా ఫలితం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి



బాధితుడు పట్టాభి, కుటుంబసభ్యులు

చిత్తూరు గ్రామీణ: తన భార్య, బిడ్డను కిడ్నాప్ చేసిన రైల్వే కానిస్టేబుల్ జ్ఞానశేఖర్‌పై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం దారుణమని పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లె మాదిగపల్లెకు చెందిన పట్టాభి కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. చిత్తూరు నగరం మురకంబట్టు పెద్దకొత్తూరు చెందిన అశోక్ కుమార్తె రోజాతో తనకు పెళ్లైందని, తమకు ఒక పాప ఉందన్నారు. తాము బెంగళూరులో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జ్ఞానశేఖర్ తన భార్య రోజాతో పరిచయం ఏర్పరచుకున్నాడన్నారు. తనకు విషయం తెలియడంతో భార్య రోజాను మందలించడంతో ఇటీవల తన భార్య, పాప కనిపించడం లేదన్నారు. అనుమానంతో కానిస్టేబుల్ జ్ఞానశేఖర్‌కు ఫోన్ చేస్తే నీ భార్య, పాప నా వద్దే ఉన్నారని, పంపించేది లేదని బెదిరిస్తున్నాడన్నారు. అతనిపై చిత్తూరు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇంత వరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ స్పందించి తన భార్య, పాపను పట్టాభి చెర నుంచి కాపాడాలని ఆయన వేడుకున్నారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

రూ.80 లక్షల సెస్ వసూలు

పుంగనూరు : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ 2024-25 ఆర్థిక సంవత్సర సెస్ వసూళ్ల లక్ష్యంలో ఇప్పటి వరకు రూ. 80 లక్షల మేర వసూలైనట్లు ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి గోపి తెలిపారు. మంగళవారం మార్కెట్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడు రూ. 1.24 కోట్ల లక్ష్యం విధించినట్లు వివరించారు. వసూలైన మొత్తంలో టమాటా మార్కెట్ ద్వారానే రూ. 50 లక్షలు చేకూరిందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం గొర్రెలు, పశువుల సంత నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఎంసీ ఆవరణలో పిట్టగోడ, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రూ. 6 లక్షలతో పనులు సాగుతున్నాయన్నారు. మూగజీవాలు అక్రమంగా తరలించకుండా, ముఖ్యంగా కబేళాలకు తరలకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు రూ. 10 వేల విరాళాన్ని ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల సంఘం జిల్లా కన్వీనర్ పఠాన్ షాహీనా, నియోజకవర్గ అధ్యక్షుడు మంజునాథ చెక్కు మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు అందించారు. పలువురు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

గుడుపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: మండల కేంద్రంలోని ఆర్.ఎస్ కూడలి నుంచి ప్రభుత్వ కళాశాల వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. నెల రోజులవుతున్నా అధికారులు, పాలకులకు పట్టించుకోలేదు. ఫలితంగా రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – మురళి, స్థానికుడు

సమాధానం: వెంటనే పరిశీలించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటా. – చంద్రప్ప, పంచాయతీ కార్యదర్శి

సోమల, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని పొదలకుంటపల్లె కాలనీ సమీపంలోని బోరు వద్ద నీరు వృథా అవుతుంది. ఆ నీరంతా తారు రోడ్డుపై ప్రవహిస్తుంది. అధికారులు స్పందించి అరికట్టాలి. – గ్రామస్థులు

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకునేలా ఆదేశిస్తాం. – లక్ష్మీదేవి, ఈవోఆర్డీ, సోమల

పలమనేరు, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని ప్రధాన రహదారి ఎంబీటీ రోడ్డులోని విద్యుత్తు దీపాల్లో కొన్ని వెలగటం లేదు. డివైడర్ మధ్యన ఏర్పాటు చేసిన వాటిలో ఓ వైపు వెలగక ఇబ్బందిగా మారింది. అధికారులు మరమ్మతులు చేయించాలి. –మనోహర్, పలమనేరు

సమాధానం: దీపాల మరమ్మతులకు యంత్రం అవసరం. రాగానే చేస్తాం. –ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్

బస్టాండ్ల దుస్థితి.. ప్రయాణానికి దుర్గతి

ఏళ్ల తరబడి అసౌకర్యాల మధ్యే ప్రాంగణాలు

కుప్పం, న్యూస్‌టుడే: రామకుప్పం, బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండల కేంద్రాల్లోనూ ఆర్టీసీ బస్టాండులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. రెండు దశాబ్దాల కిందట అప్పటి తెదేపా పాలనలో ఒక్కో బస్టాండు నిర్మాణానికి రూ. 20 లక్షలు వెచ్చించారు. ప్రారంభంలో కొన్నాళ్ల పాటు బస్టాండుల్లోకి ఆర్టీసీ బస్సులు రాకపోలు సాగించేవి. క్రమేణా నిర్వహణ లేమితో నిర్మాణాలు దుస్థితికి చేరుకున్నాయి. వినియోగానికి దూరమయ్యాయి.



గుడుపల్లె బస్టాండు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె ఆర్టీసీ బస్టాండు అధ్వానంగా మారింది. కుప్పం నుంచి గుడుపల్లె మీదుగా సంగనపల్లె, బిసానత్తం మార్గా ల్లో రాకపోకలు సాగించే బస్సులు బస్టాండులోకి రావడంలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు దుస్థితికి చేరుకున్నాయి. బస్టాండు ప్రాంగణం రాత్రుల్లో చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది.

అసౌకర్యాలే అధికం



వి.కోట ఆర్టీసీ బస్టాండు

పలమనేరు నియోజకవర్గం వి.కోట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి. కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పక్కన దాదాపు 20 ఏళ్ల కిందట నిర్మించి బస్టాండు నిర్వహణలేమితో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. సిమెంట్ ప్లాట్‌ఫారం పూర్తిగా లేచి కంకర తేలి దుమ్మురేగుతోంది. నిత్యం పదుల సంఖ్యలో బస్సులు బస్టాండులోకి వస్తుంటాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బెంచీలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు.

ప్రతిపాదనలు పంపాం

వి.కోట ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాం. గుడుపల్లె, రామకుప్పం బస్టాండ్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

- పెంచలయ్య, కుప్పం ఆర్టీసీ డీఎం

ప్రైవేట్ జోరు.. ఆర్టీసీ బేజారు

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలోని ప్రజలు నిత్యం కర్ణాటకలోని వివిధ పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగ, వ్యాపారాలు, ఇతర అవసరాల కోసం బెంగళూరుకు వెళుతుంటారు. అయితే వారికి సరిపడా ఆర్టీసీ బస్సు సర్వీసులు లేక ప్రైవేట్‌పై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిపై వార్తలు ప్రచురించినా, స్థానికులు విన్నవించినా ఆర్టీసీ అధికారులు చెవికెక్కించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దసరా సెలవుల తర్వాత బెంగళూరు వెళ్లేందుకు వందల మంది రాగా.. ఆర్టీసీ బస్సుల్లేక ప్రైవేటు, కర్ణాటక బస్సులను ఆశ్రయించడం కనిపించింది.



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ప్రైవేటు బస్సులు

వైకాపా పాపమే

గత ప్రభుత్వం ఇక్కడి ఆర్టీసీ డిపో నుంచి వెళ్లే సర్వీసులను రద్దు చేశారు. చాలా వరకు బస్సులను పక్కనున్న పుంగనూరు డిపోకు తరలించేశారు. దాంతో బెంగళూరుకు సర్వీసులు లేక ఇతర డిపోల నుంచి వచ్చే బస్సులు, ప్రైవేటు బస్సుల మీద మాత్రమే ఆధారపడుతున్నారు. గతంలో పండుగ సమయాల్లో మాత్రమే రద్దీ ఉండేది. ఇప్పుడు నిత్యం రద్దీగానే ఉంటుంది. పట్టణంలోని చర్చి, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం, అంబేడ్కర్ సర్కిల్, ఎంబీటీ రహదారిపై నిరీక్షిస్తూ కనిపిస్తున్నారు. వచ్చిన బస్సుల్లో ఎక్కడానికి అవస్థలు పడుతుంటారు.

సీట్లు లేక అవస్థలు

ఇతర డిపోల నుంచి వచ్చే బస్సుల్లో అప్పటికే ప్రయాణికులు నిండుగా ఉంటారు. ఇక సీట్లు లేక నిలబడి ప్రయాణం చేయాలి. ప్రైవేటు బస్సుల్లో సామర్థ్యానికి మించి ఎక్కిస్తున్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో బస్సులు ఇలానే కనిపించాయి. పలమనేరు పరిరక్షణ సమితి, ఇతర సంఘాల ప్రజలు అధికారులకు బస్సుల కోసం విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. ప్రయాణికుల గోడు పట్టించుకునే నాథుడే లేకపోయారు. సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆందోళనలు, ధర్నాలు చేశారు. పరిస్థితిని పరిశీలించి ప్రత్యేక సర్వీసులు నడపటానికి ప్రయత్నిస్తామని ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ చెప్పారు.

17న కబడ్డీ పోటీలు.. బైరెడ్డిపల్లె: వాల్మీకి జయంతి సందర్భంగా శ్రీవాల్మీకి యూత్ ఆధ్వర్యంలో ఈనెల 17న కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. ప్రథమ రూ. 15,116, ద్వితీయ రూ. 10,116, తృతీయ రూ. 7,116, నాల్గో స్థానం రూ. 5,116 నగదు అందజేస్తామని చెప్పారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ...దేవదొడ్డిలో నూతనంగా నిర్మించిన శ్రీదుర్గాదేవి ఆలయంలో ఈనెల 17న విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం వేడుకగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు.. తరగతుల నిర్వహణ



పలమనేరు, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అయితే పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆయన ఆదేశాలను బేఖాతరు చేసింది. దీనిపై తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 9, 10 తరగతుల పిల్లలకు తరగతులు జరిగినట్లు నిర్వాహకులు సైతం అంగీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల తెరవడంతో చిన్నారులు వర్షంలో తడుస్తూ రాకపోకలు సాగించారు. ఈ ఘటన విమర్శలకు తావిచ్చింది. పలమనేరు ఎంఈవో బాలసుందరం మాట్లాడుతూ పాఠశాలపై తమకు ఫిర్యాదు వచ్చిందన్నారు. నిర్వాహకులను సంజాయిషీ కోరామన్నారు. ఫిర్యాదుపై నివేదికను జిల్లా అధికారులకు పంపుతున్నట్లు చెప్పారు.

గ్రామాలాభివృద్ధే పల్లె పండగ లక్ష్యం

పెద్దబదనవాడ (గుడుపల్లె), న్యూస్‌టుడే: గ్రామాల్లో వంద శాతం మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పల్లె-పండగ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం అన్నారు. పెద్దబదనవాడ పంచాయతీ కమ్మగుట్టపల్లెలో ఆయన మంగళవారం పాలకులు, అధికారులు ఎమ్మెల్సీ శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించే దిశగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అడుగులు వేస్తున్నారని వివరించారు. పేదరికం లేని పల్లెలే లక్ష్యంగా రైతులకు రాయితీ పథకాలు, పాడి పశువుల పోషణ, సెరికల్చర్ ప్రోత్సాహక, ఉద్యాన పంటలు, యంత్రాలు, పనిముట్లు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు నరేష్, సుబ్రహ్మణ్యం, టిఎం. బాబు, వెంకటేష్, తహసీల్దారు సీతారాం, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.



కమ్మగుట్టపల్లె గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం







కుప్పం: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేజీఎఫ్ ప్రిన్సిపల్ డా.సుధాకర్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు ◆ సోమల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. ◆ పుంగనూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అయూబ్‌ఖాన్

న్యూస్‌టుడే, బృందం: క్షిపణి పితామహుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని వక్తలు అభిప్రాయపడ్డారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, పురపాలికల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు. కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. పుంగనూరులో ఏపీజె అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మురుగు గుంట.. దోమల తంటా



మురుగు గుంట.. రెండు అడుగుల లోతు మేర ఉంది. అందులోని నీరంతా నెలల తరబడి నిల్వ ఉండటంతో మురుగుమయంగా మారింది. నీటి నిల్వల్లోనే డెంగీ, మలేరియా, విషజ్వరాలకు కారణమయ్యే దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల లార్వాలు అట్టలు కట్టి కనిపిస్తున్నా.. పంచాయతీ అధికారులకు పట్టని దుస్థితి. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు నిత్యం అటు వైపు రాకపోకలు సాగిస్తున్నా.. తమకేమీ పట్టనట్లు వ్యవరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించాలి. - న్యూస్‌టుడే, గుడుపల్లె

పశువుల పాకగా ఆరోగ్య కేంద్రం



పాతపేటలో అసంపూర్తిగా ఆగిన ఆరోగ్య కేంద్ర భవనం పశువుల పాకలా మారింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన భవన నిర్మాణం మోల్డింగ్ దశలోనే ఆగిపోయింది. గోడలకు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీల అమరిక, రంగులు వేసే పనులు చేయాల్సి ఉంది. రెండేళ్లుగా ఆగిన అసంపూర్తి భవనం మందుబాబులకు నిలయమైంది. స్థానికులు కొందరు మూగజీవాలను కట్టేస్తుండటంతో పశువుల కొట్టంగా మారింది. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం అసంపూర్తిగా వదిలేయడంతో ఇలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె

నడిరోడ్డులో గుంత.. వాహనదారులకు చింత



పట్టణంలోని కుమ్మరవీధి ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. వైకాపా పాలన హయాంలో గుంత ఏర్పడింది. కనీసం మరమ్మతులు, నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో ఆ సమస్య అలాగే ఉండిపోయింది. నెలల తరబడి ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పలువురు ప్రమాదాల్లో గాయపడి బాధితులుగా మారారు. రాత్రిళ్లు అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు

ప్రమాదపుటంచున విద్యుత్తు స్తంభాలు





మండల పరిధి ఎన్. కొత్తపల్లె పంచాయతీ కేంద్రంలో వీధిదీపాలకోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అడుగుభాగంలో సిమెంట్ పెచ్చులూడి కమ్మీలు తేలి కనిపిస్తున్నాయి. దీనివల్ల ఈదురుగాలుల ధాటికి స్తంభాలు కూలిపోయే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత రెస్కో అధికారులు స్పందించి కొత్త స్తంభాలు నాటించాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కుప్పం గ్రామీణ

ముందస్తుగా బ్యానర్ల తొలగింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: తీవ్ర అల్పపీడనం ప్రభావంతో పెనుగాలులు, భారీ వర్షాలు కురిసినా పట్టణంలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రమాదకరంగా ఉన్న బ్యానర్లు, కటౌట్‌లు తొలగించామని పురపాలక కమిషనరు మధుసూదనరెడ్డి మంగళవారం తెలిపారు. కాలువల్లో పూడిక తొలగించి, సిబ్బందిని అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కాలువలు పొంగిపొర్లే చోట ఎలాంటి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి.. సోమల: వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులునాయుడు, పశువైద్యాధికారి చందనప్రియ సూచించారు. పశువులను చెట్ల కింద కట్టేయకూడదని, పశుగ్రాసం సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం.. సోమల: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థిని మందా నాగమల్లేశ్వరీ పది పరీక్షల్లో ప్రతిభ చాటి ట్రిపుల్ ఐటీ సాధించారు. ప్రతిభను గుర్తించిన ఎస్. నడింపల్లెకు చెందిన బాలన్నగారి శివసాగర్ రూ. 5వేల నగదు అందించారు. ప్రధానోపాధ్యాయుడు హరినాథ్ పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

17న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు మంగళవారం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉద్యోగ కల్పనా కార్యాలయం, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పలు ప్రైవేట్ సంస్థలు మేళాలో పాల్గొంటాయని వివరించారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18- 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగులు వినియోగించుకోవాలని తెలిపారు.

గ్రామీణాభివృద్ధికి కృషి

బైరెడ్డిపల్లె: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని ఎంపీడీవో రాజేంద్రబాలాజీ అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దేవదొడ్డి, తీర్థం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులు, అధికారులు భూమిపూజ చేపట్టారు. కూటాలవంకలో రూ. 5.40 లక్షలతో సిమెంటు రోడ్డు మొగిలిపొదలరేవులో రూ. 3.40 లక్షలు, తీర్థంలో రూ. 9.70 లక్షలతో కాలువలు, రూ. 2.40 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండగ

శాంతిపురం: మండల పరిధిలో ఈనెల 16 బుధవారం నుంచి 20 వరకు పల్లె పండగ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ కుమార్ మంగళవారం తెలిపారు. 23 పంచాయతీల్లోని గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. 10.23 కోట్లతో 291 పనులు చేపట్టేందుకు భూమి పూజ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

చింతపండు వ్యాపారుల సమస్యలపై దృష్టి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని చింతపండు వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో కలిసిన చింతపండు వ్యాపారులు తమ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పుంగనూరు పట్టణ ఏఎంసీ ఆవరణలో గదులు నిర్మించి తమకు అద్దెకు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో అద్దెకు ఇస్తామని ఒప్పందం చేసుకున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. చాంద్‌బాషా, అఫ్సర్‌బాషా, ఇంతు, బాబా, హఫీజ్ పాల్గొన్నారు.



చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన చింతపండు వ్యాపారులు

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

పుంగనూరు: వాల్మీకులను బీసీలుగా గుర్తిస్తున్న జిల్లాల్లో ఎస్టీలుగా మార్చాలని వాల్మీకి సేవాసంఘం గౌరవాధ్యక్షులు, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమన్నారు. శ్రీనివాసులు, అద్దాల నాగరాజ, రాజశేఖర, రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు

ఆక్రమణకు గురికాకుండా చర్యలు: ఛైర్మన్

పుంగనూరు, న్యూస్‌టుడే: రాగానిపల్లె, రాంపల్లె వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్‌లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని పురపాలక ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. రాంపల్లె వద్ద ప్రభుత్వం సేకరించి ఇళ్ల స్థలాలుగా కేటాయించిన భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారని, రాగానిపల్లె లేఔట్‌లో కొంత భూమి సాగు చేశారని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం సేకరించిన భూమి అన్యాక్రాంతం గాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రాముతో మాట్లాడినట్లు ఛైర్మన్ తెలిపారు.



గుడుపల్లె: కళాశాల ఎదుట పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలి

గుడుపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఒప్పంద అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు వి. చంద్రప్ప డిమాండ్ చేశారు. గుడుపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు మంగళవారం పసుపు రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. 24 ఏళ్లుగా ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలన్నారు. నినాదాలు చేశారు.

కుప్పం పట్టణం: ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు మంగళవారం పసుపు రిబ్బన్లతో నిరసన తెలిపారు. 114 జీవో ఉత్తర్వుల ప్రకారం ఒప్పంద అధ్యాపకులను ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. **సోమల:** గత ప్రభుత్వం ఇచ్చిన క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అమలు చేయాలని ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. పసుపు రిబ్బన్లతో హాజరై నిరసన తెలిపారు. గౌతమ్, వెంకటసుబ్బయ్య, శివయ్య, సుధా, గీతాంజలి పాల్గొన్నారు.

మడుగులు కాదు.. రహదారులే..!



బైరెడ్డిపల్లె-కడపనత్తం మార్గంలో పాతూరు నత్తం వద్ద తారు రోడ్డు దుస్థితి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పల్లె దారులు గుంతలమయమై దుస్థితికి చేరాయి. గత ప్రభుత్వంలో రోడ్ల నిర్వహణ సైతం విస్మరించడంతో తారు రోడ్లు ధ్వంసమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికే రోడ్లు మడుగులను తలపిస్తున్నాయి. బైరెడ్డిపల్లె-కడపనత్తం మార్గంలో ప్రయాణం చోదకులకు సాహసంగా మారింది. 5 కి.మీ దారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలకు తోడు వర్షపునీరు చేరి బురదగుంటలుగా మారాయి. ఆర్అండ్‌బీ ఏఈ ఆదికేశవులును వివరణ కోరగా నిధులు రాగానే పనులు చేస్తామన్నారు.



బైరెడ్డిపల్లె-కడపనత్తం రహదారిలో పాతపేట వద్ద..



కుప్పం: కమతమూరు రోడ్డులో నిలిచిన నీరు

కుప్పంలో.. కుప్పం పట్టణం: ఓ వైపు అల్పపీడనం కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలుస్తూ ఇబ్బందులకు గురి చేస్తుంటే.. మరో వైపు మురుగు నీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పురపాలిక సిబ్బంది బండలను తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ప్రజాప్రతినిధులు బాధ్యతగా మెలగాలి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు బాధ్యతగా మెలగాలని ఎంపీడీవో రాజేంద్రబాలాజీ అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణలో మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్లు రాజశేఖరాచారి, సురేష్, గణేష్, మండల కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

చౌడేపల్లె: పంచాయతీ పాలనలో వార్డు సభ్యులు, ఉప సర్పంచి పాత్ర కీలకమని ఈవోపీఆర్డీ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచి, వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం చేయడం ప్రథమ బాధ్యతని తెలిపారు.



బైరెడ్డిపలె: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజేంద్రబాలాజీ

పుంగనూరు గ్రామీణ: మండల పరిధిలోని 23 పంచాయతీల్లోని ఉప సర్పంచులకు, ఇద్దరు వార్డు సభ్యుల చొప్పున రెండు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో లీలామాధవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు.. పుంగనూరు గ్రామీణ: మండల పరిధిలో మంగళవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. సోమల మండలం నవాబ్‌పేట నుంచి చౌడేపల్లె మండలం ఖాన్‌సాన్‌మిట్టకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మతగురువు అషరఫ్(35), సమీవుల్లా చౌడేపల్లె నుంచి సోమల వైపు వెళుతున్న మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా వెళ్లి ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పాలెంపల్లె పంచాయతీ షికారిపాళ్యంకు చెందిన ముత్యాలప్ప పట్టణం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ భీమగానిపల్లె బైపాస్‌రోడ్డు అదుపుతప్పి బోల్తాపడి గాయపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వృద్ధుడి అదృశ్యం.. చౌడేపల్లె: తండ్రి ఆచూకీ తెలపాలని మంగళవారం తనయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శెట్టిపేట పంచాయతీ మేకలచిన్నేపల్లెకు చెందిన కొండూరు వెంకట్రాజు(60) ఆగస్టు 28న ఇంటి నుంచి వెళ్లాడు. అదే నెల 30న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ద్వారా ఢిల్లీ నుంచి వస్తున్నానని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇప్పటి వరకు ఇల్లు చేరలేదని, బంధువుల వద్ద విచారించిన ఆచూకీ లేదన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుని కుమారుడు తిరుమల రాజు తెలిపారు.